


కథ 1993

13

# నిత్యమూ-నిరంతరమూ

మధురాంతకం నరేంద్ర

మునిగాళ్లపై నిల్చుని, విల్లులా వంగి అర ఫర్లాంగు పొడవున్న వీధి మలుపు వరకూ కలయజూసిన తరువాత, "యెప్పుడో యిట్ల చూస్తా చూస్తా కాలుజారి కిందపడి చస్తానేమో నేను...." అని నాలుకను కోపంగా కరచిపెట్టి గొణుక్కుంటూ వెనుదిరిగి, ఇంటిలో కొచ్చి, "వీధిలో ట్రాఫిక్ కూడా తగ్గిపోయింది, వదినా!" అంది షర్మిల.

సగం నిద్రలో సైతం ఏడుస్తూ రాగాలు తీస్తున్న అయిదేళ్ల అమ్మాయిని జోకొడుతూ తల పైకెత్తి చూసి, కనుకొలకుల్లోని కన్నీటిచుక్కని మోచేత్తో తుడుచు కుంటూ పెదవినదోలా పెట్టి నవ్వడానికి ప్రయత్నించి విఫలు రాలైపోయింది సుశీల.

నైట్‌బల్బు వెలుతుర్లో గది వెలవెలబోతోంది.

నవారు మంచం పైన ఏడేళ్ల అమ్మాయొకతి నిద్రపోతోంది. పిల్లలకు నిద్రాభంగం కలిగించకుండా బాగా వాల్యూం తగ్గించి పెట్టిన టీవీలో డిష్ సినిమా ప్రసారమవుతోంది. నేలపై పిల్లల బొమ్మలు చిందర వందరగా పడి ఉన్నాయి. ట్యూబ్‌లైటు వెలుగుతున్న అవతలివైపు గదిలోని ఉయ్యాలలో ఏడాది వయసున్న పాపాయి నిద్రపోతోంది. గోడపైని ఎలక్ట్రానిక్ గోడ గడియారం కదలడం మానేసి చాలారోజులై పోయి నట్టుంది. బాత్‌రూంలోని కొళాయిలోంచి నీటి గడి యారంలా నీళ్లు టపటపమని శబ్దం చేస్తూ రాలు తున్నాయి. దోమల రాకని ఆపుతున్న మస్కిటో మాట్ వాసన గాఢంగా గదంతా వ్యాపించి ఉంది.

సుశీల మరోసారి పాపాయి ఛాతీపైన చేయిపెట్టి చూసి, "ఒళ్లు వేడిగానే ఉంది. ఈ సమయంలో డాక్టరు ఉంటాడంటావా, వదినా!" అని ప్రశ్నించింది.

ఓ నిముషంసేపు ఆలోచించిన తర్వాత, "ఏమో! ఇంటి కెళ్లిపోయినా ఫరవాలేదులే! డాక్టరు ఈయనకు ఫ్రెండే కదా! వాళ్లిల్లు డిస్పెన్సరీకి దగ్గరే. ఇంటికాడి కెళ్లినా చూస్తాడాయన," అంది షర్మిల.

గోడపైన పెద్ద పెద్ద మసీదుల ఫోటోల మధ్య ఏదో లైసెన్సు తాలూకు ఫోటో కూడా వేలాడుతోంది. నిలువెత్తు అలమారులోని చాలా భాగాన్ని పెద్ద పెద్ద పుస్తకాలు ఆక్రమించుకున్నాయి. 'కె.ఎస్.భాషా, ఛార్టెర్డ్ అకౌంటెంట్' అన్న అక్షరాలున్న ప్లాస్టిక్ బోర్డొకటి పుస్తకాల పక్కన తలకిందులుగా పడి ఉంది.

టీ.వీ. సినిమాతో లంకె కుదరడం సాధ్యం కాదని అర్థమయిన తర్వాత, "ఇంట్లో ధర్మామీటరుందా?" అని అడిగింది సుశీల.

"ఉంది, వదినా! చూస్తానుండు. ఆయనెక్కడో సర్దిపెట్టేసుంటారు" పైకి లేచి, అలమారులో వెదికి ధర్మామీటరు తీసుకొచ్చింది షర్మిల.

సుశీల ధర్మామీటర్‌లో రీడింగ్ చూస్తుండగా- "నీకు ధర్మామీటరు చూసేదొచ్చునా?" అని ఆశ్చర్యపడి పోయింది.

"నూరు డిగ్రీలుంది జ్వరం. మందో, మాకో పోయకపోతే ఎలా తగ్గుతుంది? ఊరుగాని ఊరికొచ్చాం కదా! పెళ్లాం పిల్లల్ని ఇలా వదిలిపెట్టి పార్టీల కెళ్లిపోతే వాళ్ల గతేంకాను? అన్న ఊసే లేదు వారికి. 'సెలవు లెప్పుడొస్తాయా, ఎప్పుడీ వూరు వచ్చి చిన్ననాటి స్నేహి తుడితో ఊరేగుదామా' అని ఉవ్విళ్లూరుతూ ఉంటే,

తీరా పరాయి ఊళ్లోనయినా కొద్దిరోజులు కళ్లముందు నడయాడక పోతారా అని ఎదురుచూశాను. రైలులో గంటల తరబడీ ప్రయాణం చేసి అలసిపోయానంటూ ఈయన ఈ ప్రోగ్రాం ఇవ్వాళే పెట్టుకోవాలా?" సుశీల గొంతులో విసుగు స్పష్టంగా ధ్వనించింది.

"నేనొద్దంటే ఆయన వింటారా? నువ్వూ చూసి నావు గదా, వదినా! అసలు ఈ అన్న కోసరమనే ఆ సీసా ఇంట్లో యెత్తిపెట్టినానని నాతో ఎన్నోసార్లు చెప్పినారు. తీరా ఆయనొచ్చినాక ఇంక వాళ్లనాపేదానికి మనవల్లే మవుతాది చెప్పు! నేనేమో బిన్నాగా ముగించమని చెప్పే బాటిలిచ్చినాను," అంటూ వాపోయింది షర్మిల.

"ఇంట్లో మీ పాప మందులేమైనా ఉన్నాయా?" అని అడిగింది సుశీల.

షర్మిల అలమారు గాలించి మూడు టానిక్ సీసాల్ని వెలికితీసింది. "ఇవన్నీ పాప మందులే! జరం మందు కూడా ఉండాల. ఇదేననుకుంటా- పెట్టెపైన జ్వరం అని ఆయనే రాసి పెట్టినారు. నేను వేరే ఏదైనా పోసేస్తానేమోనని ఆయన భయం!"

సుశీల టానిక్ సీసాపైని లేబుల్‌నోసారి చదివి చూసిన తర్వాత పాపని బలవంతంగా లేపి కూర్చో బెట్టింది. షర్మిల దగ్గరికొచ్చి ఏడుస్తున్న పాపని రెండు చేతులతోనూ గట్టిగా పట్టుకుంది. పిల్లాడి చేతిలో చిక్కిన తుమ్మెదలా పాప విలవిలా కొట్టుకోసాగింది. బల వంతంగా పాప నోరు తెరిపించి మందు పోసింది సుశీల. సగం మందు పాప పెదవుల పైనుంచే జారి గౌనుపై పడిపోయింది.

"ఇంకో సగం మూత పోద్దామా?" అంది షర్మిల.

"వద్దులే వదినా! కొంత గొంతు దిగిందిగదా!" అంది సుశీల.

యుద్ధంలో ఓడిపోయిన సైనికుడిలా పాప బుంగమూతి పెట్టుకుని దీర్ఘాలు తీయసాగింది.

మిద్దె మెట్లపైన టపటపమని అడుగుల శబ్దం వినిపించగానే సుశీల ఆత్రుతతో తల పైకెత్తి చూసింది.

"అది హవాయి చెప్పుల చప్పుడు. సుగుణమ్మ! ఏసుదాసు పెండ్లాం," అంది షర్మిల.

సుగుణమ్మ మిద్దె మెట్లెక్కి వరండాలో కొచ్చి నిల్చుంది. షర్మిల ఆమెవైపుకైనా చూడకుండా సుశీల ముందున్న మందుల సీసాల నెత్తుకుని అలమారులో సర్దసాగింది.

అసలే పొట్టిగా ఉన్న సుగుణమ్మ మరింతగా ఒంగిపోయి నిల్చుని బిక్కుబిక్కుమని చూస్తోంది. ఆమె కట్టుకున్న నాసిరకం నేతచీర రంగు చీకటితో కలిసి పోయి వుంది.

షర్మిల లోపలి గదిలోకెళ్లి ఊయల్లోకి తొంగి చూసి, కాసేపు లోపలే తచ్చాడి ఆ తరువాత ముందు గదిలోకొచ్చింది.

సుగుణమ్మ అలాగే వరండాలో నిల్చుని ఉంది. "ఏం సుగుణమ్మా! ఏం కావాలి?" అని తాపీగా ప్రశ్నిం చింది షర్మిల.

"డిష్‌లో సినిమా..." సుగుణమ్మ నవ్వే ప్రయత్న మైనా చేయడంలేదు.

"ఈ పొద్దేసిన సినిమాలో ఒకటే ఫైటింగు, నీకు సరిపడదులే! రేపు రా, బో ! వేరే సినిమా చూద్దువు గానిలే!"

సుగుణమ్మ అయిదారు నిముషాల వరకూ వేచి చూసి, ఇక ఇవ్వాల్టికి తనకాహ్వానం దొరకదని నిర్ణ యించుకున్న తర్వాత వెనుదిరిగింది.

"పోతే పోనీ అని పగుల్లో డిష్ సినిమా చూడ నిచ్చిందానికి, పొద్దుగూకులూ అదేపనా? కొంచెం తావిస్తే చాలు! నెత్తిపైకొచ్చి కూర్చుంటారు," షర్మిల గొణుక్కుంటూ ఏమంటావన్నట్టుగా సుశీలకేసి చూసింది.

ఆ మాటలు తన చెవిన బడనట్టుగా- "ఇంతకీ రాత్రికి డాక్టరు దగ్గరికెళ్లటం లేదన్నమాటే గదా!" అంది ఆమె.

"ఈ మగోళ్లెక్కడ తిప్పేసినారో, ఏమో! సాయంత్రం బిడ్డకు ఒళ్లు ఉడుగ్గా ఉండాదని నువ్వు చెప్పను కూడా చెప్తివిగదా? మీ ఆయన కూడా మా ఆయనకు తీసి పొయ్యేట్టు లేడు వదినా?" అని, అంతలో ఏదో జ్ఞాపకం రాగా, గబగబా వరండాలోకి నడిచి, "సుగుణమ్మా! కొంచెం పైకొచ్చి పో!" అంటూ కేకేసింది షర్మిల.

సుగుణమ్మ మెట్లెక్కి, మిద్దెపైకొచ్చేసరికి షర్మిల కుర్చీలో దర్జాగా కూర్చుని ఉంది.

ఆమె మౌనంగా నిల్చుంది.

"మీ ఆయనుండాడా ఇంట్లో?"

ఉన్నాడని తలపైకీ కిందికీ ఊపుతూ తెలియ జేసింది ఆమె.

"వాళ్ల సారూ, సార్ వాళ్ల ఫ్రెండూ సాయంత్ర మనగా టౌన్లోకి పోయినారు. ఇంట్లో ఆ అన్నోళ్ల బిడ్డకు జరంగా ఉంది. డాక్టరుకాడికెళ్లాల! కొంచెం ఊర్లోకెళ్లి వాళ్లేడుండారో చూసి రమ్మను!"

మరోసారి మూకాభినయం చేస్తూ అలాగేనని తెలియజేసింది ఆమె.

"తల ఊపినట్టుగాదు. మరిచిపోకుండా చెప్పాల. ఆ టౌను క్లబ్బులో చూడమను, లేకపోతే రంగస్వామి వాళ్లింట్లో చూడమను. ముందాపని చేసి, వాళ్ల సార్‌ను చూసి, ఇంటికి రమ్మని చెప్పినాక, ఇంకోపని చెయ్య మన్నాని చెప్పు పో! బిన్నా చెప్పు!"

సుగుణమ్మ చెప్పుల్ని టపటపలాడించుకుంటూ వెళ్లిపోయింది.

"చెప్తుందో, లేదో! మూగెద్దు మాదిరి తలాడించ మంటే మాత్రం పనికొస్తాది. కొట్టినా, కోసినా కదిలే రకం కాదు. చెప్తుందో, చెప్పదో!"

"ఎవరావిడ?" అని అడిగింది సుశీల.

"ఏసుదాసును చూళ్లేదా నువ్వు! మా ఆయన ఆఫీసులో క్లర్కు. నిన్న సాయంత్రం మనకు సినిమా టికెట్లు తెచ్చిచ్చినాడు చూడూ, సన్నంగా, పొట్టిగా, నల్లగా- ముసిలి యెలుంగొడ్డు మాదిరుంటాడు. వాని పెండ్లాం. దీనితో పోలిస్తే ఏసుదాసే మేలు. దీనికొళ్లంతా పొగరు. ఆ మొగుడికీ, దానికీ ఏడెనిమిదేండ్లుగా మాట ల్లేవు. వాడు ఉప్పయితే, యిది నిప్పు!"

"వాళ్లు ఏడేళ్లుగా మాటాడుకోవటం లేదా ఎందుకని?" సుశీల అడ్డుతగిలింది.

"ఏం పాడో! ఇద్దరికిద్దరేలే! సమాచారం తెలుసుకుందామని చానాసార్లు కదిలించి చూసినాను. ఏమడిగినా ఇద్దరూ జవాబు చెప్పలేదు. జమ్మని రాజుల మాదిరి ఇద్దరు మగబిడ్డలుండారు. దానికేమైనా కావా లంటే వాళ్లతోనే చెప్తాదంట. అతనికేమైనా కావాలంటే వాళ్లతోనే చెప్తాడంట. ఉండేదేమో ఒకే కప్పు కింద. మాటలేమో లేవు. కడుపుమంట సంసారం. దానికి సిన్మాలూ, అతనికి బీడీలూ, ఇస్పేట్టాకులూ - వాళ్లకేదో రకంగా రాజీ కుదిరించమంటే మా ఆయన ఊళ్లో పెత్తనాలు నీకెందుకని యెగిరిపడినాడు!"

"ఏళ్ల తరబడీ మొగుడూ పెళ్లాలు మాటాడు కోటం లేదంటే ఏదో పెద్దగొడవే జరిగుంటుంది. ఇరుగూ పొరుగూ వాళ్లకైనా తెలియదా ఏం జరిగిందో?"

"ప్చ్! అయినా ఈ టౌన్లలో పక్కింట్లో ఏం జరగతా ఉందో ఎవరు పట్టించుకుంటారు వదినా? మా ఆయన కింద క్లర్కు కాబట్టి నాదాకా వచ్చింది ఆ మాట. ఏందో జరిగే ఉంటుంది. అదేమైనా తప్పుడుపని చేసిం దేమో! మొగాళ్లని తినేసేటట్టు చూస్తాదెప్పుడూ! అయినా ఆ మొగమనిషి పగులూ, రేయీ అవస్తలు పడి సాకతానే ఉండాడు"

మొదటి సినిమా వదిలిపెట్టినట్టున్నారు.

లోపలి గదిలో ఉయ్యాల కింద నేలని పాపాయి తడిపేసింది, ఏడవసాగింది.

డిష్‌లో డిస్ట్రబెన్స్ రావడంతో టీ.వీ. రకరకాల విన్యాసాలు చేస్తోంది. విసుగ్గా దానిమీట నొక్కి లోపలి కెళ్లి పాపాయినెత్తుకుంది షర్మిల. వంటగదిలోకెళ్లి పాలు కలిపి సీసాలో పోసి పాపాయి నోట్లో పెట్టింది. పాపని బుజ్జగించుతూ మళ్లీ ముందుగదిలోకొచ్చింది.

"ఇంతకూ మీ సుగుణమ్మ వాళ్లాయనకి చెప్పిందో, లేదో? అతను వెతుకుతున్నాడో, లేదో?" సుశీల స్వగతంలా గొణిగింది.

"మందు పోసినాం గదా! పరవాలేదులే వదినా! తెల్లారితే డాక్టరు దగ్గరికి పోదాం" అంటూ మొదలు పెట్టింది షర్మిల.

"మా జరీనాకు పోయిన నెలలో నూట రెండు డిగ్రీల జ్వరం వచ్చింది. ఆ పొద్దు కూడా ఈ మాదిరే జరిగింది. ఆయనేమో ఆడిటింగు పనుల్తో ఊరంతా తిరగతా ఉన్నారు. రాత్రి ఎనిమిదయినా ఇంటికి రాలేదు. బిడ్డకు ఒళ్లు కాలిపోతా ఉంది. ఉన్నట్టుండి అదొకమాదిరిగా పడిపోయింది. నాకేడుపొచ్చేసింది. బోరుమని ఏడ్చేసినాను. కిందుండే ఇంటిగల్లామె పైకొచ్చి చూసి వాళ్లాయనని తోడు పంపించింది. ఆయన స్కూటర్లో వెనకే వస్తా ఉంటే నేను రిక్షాలో బయల్దేరి డాక్టరు దగ్గరికి పోయినాం. ఆ డాక్టరుకు కూడా కోపమొచ్చేసింది. అయిసు నీళ్లతో తుడవలే దెందుకని ఉరిమురిమి చూసినాడు. వెంటవెంటే రెండు ఇంజెక్షన్లు పొడిచినాడు. ఎప్పుడో రాత్రి పదిన్నరకు మా ఆయన ఆస్పత్రికొచ్చినారు. బిడ్డకు ఫిట్స్ వచ్చేదాకా ఊరికే ఎందుకున్నారని నాపైన మండిపడినారు. డిగ్రీ దాకా చదివిందెందుకని, డాక్టరు దగ్గరికెళ్లే పనైనా పెళ్లాం చెయ్యకపోతే నేనెట్లా బతకాల- అని ఒకటే ఆగిత్యం చేసినారు. అప్పుడే మందులు తెచ్చిపెట్టి, డబ్బాలపైన ఏది జరం మందో, ఏది దగ్గుమందో, కడుపునొప్పొస్తే ఏది పోయాలో వివరంగా రాసిపెట్టినారు. అంతేగానీ టయం ప్రకారం ఇంటికి రాకపోయి నందుకు ఆయనకు బాధేలేదు. ఈ మాదిరి ఎదురు చూసీ చూసీ నాకు అలవాటైపోయింది. అయినా మా ఆయనేమైనా మీ ఆయన మాదిరిగా లెక్చరరా ఎప్పుడూ ఇంట్లో కూర్చునేదానికి? ఆడిటరుకు ఇంట్లో కూర్చుంటే జరుగు తుందా?"

"ఎదురు చూడ్డమనేది నాకు కూడా కొత్తకాదులే వదినా?" అంటూ తాను చెప్పసాగింది సుశీల-

"పేరుకు లెక్చరరేగాని వారు ఆ పని తప్ప మిగిలిన అన్ని పనులూ చేస్తూంటారు. వాళ్ల డిగ్రీకాలేజిలో నెలలో సగం రోజులు స్ట్రయికులే గదా! వారి అసలు ఉద్యోగం పబ్లిక్ రిలేషన్ ఆఫీసరు. ఆర్ట్సు లవర్స్ అసోసియేషన్ సెక్రటరీ ఆయనే! ఎన్సీసీ ఆఫీసరూ ఆయనే! బంధువు లైనా, స్నేహితులైనా ఎవరు ఏ పనిపైన మావూరొచ్చినా వారి దగ్గరికే వస్తూంటారందరూ. వాళ్లు రావటమే ఆలస్యం ఇక ఆ పని పూర్తయ్యేవరకూ వారికి నిద్ర పట్టదు. తిండి రుచించదు. హాస్టలుకొచ్చినట్టుగా భోజనానికీ, నిద్రకూ మాత్రమే ఇంటికి రావటం. అసలా కోసారి భోజనం కూడా బయటే! ఎవరికేం పని వచ్చినా, 'శ్రీనాథ్‌గారున్నారండీ!' అంటూ ఇంటికొచ్చేస్తారు. తర్వాత ఆయనని పట్టలేం.

"మా ఇల్లు సంగతేమిటా అంటే అదొక ఖార్కానా, ప్రొద్దున అయిదింటికి నిద్రలేస్తానా, అయినా సమయానికి కాలేజీ కెళ్లలేను నేను. ఎనిమిదింటికంతా టిఫన్లయిపోవాలి. తొమ్మిదికంతా వంట పూర్తవ్వాలి. కారుణ్యని కాన్వెంటులో దించి వచ్చాక చిన్నదాన్ని ఛైల్డ్ కేర్ సెంటర్లో వదిలిపెట్టి రావాలి. నన్ను మా కాలేజీలో దింపేసి మీ అన్నయ్యగారు తన కాలేజీకి వెళ్లాలి. వారి కాలేజీ ఊరికో చివర్లో ఉంటే, నా కాలేజీ ఇంకో చివర్లో ఉంది. పెట్రోలు ఖర్చు చెప్పాల్సిన పనేలేదు. ఇద్దరూ ఉద్యోగాలు చేయడమంత బుద్ధిలేని పని ఇంకొకటి లేదంటే నమ్ము. అయినా ఇప్పుడు ఫర్వాలేదనుకో. ఉద్యోగంలో చేరిన కొత్తలోనయితే ప్రిపరేషన్‌కు సమయం దొరక్క చచ్చేదాన్ని. క్లాసులు అయిపోయినా వారొచ్చేదాకా కాలేజీలోనే అఘోరించాలి. ఒకోసారి విసుగేసి రిక్షా ఎక్కి వెళ్లిపోతుంటాను. రిక్షాకు పదులూ ఇరవైలూ తగలేస్తున్నానని వారికి విసుగు. నన్ను కూడా స్కూటరో, మోపెడో నేర్చుకోమన్నారు. ప్రయత్నించాను కూడా. నేర్చుకుంటూ కిందపడ్డానోసారి. తర్వాత ముట్టుకోలేదు. అదీ వొకందుకు మేలే! ఇలాగైతే ఇంటికీ, కాలేజీకి తిరిగేటప్పుడయినా కంటికి కన బడతారు. లేకపోతే అదీ ఉండదు. అయితే ఉన్న బాధల్లా ఒక్కటే! ఎదురుచూడ్డం.... కాలేజీలో ఎదురు చూడ్డం... ఇంట్లో ఎదురుచూడ్డం... బాగా అలవాటై పోయింది..."

వీధిలో స్కూటర్ శబ్దం వినిపించడంతో ఆమె మాట్లాడడం ఆపి మెట్లకేసి చూపులు సారించింది.

"అది పక్కింటాయన మోటారుబైకు... స్కూటరు సౌండు అట్లుండదు..." అంది షర్మిల.

లాలిత్య గౌను బొత్తాల్ని విప్పుతూ- "చెమట పోస్తోంది. బిడ్డకు జ్వరం వదులుతోందనుకుంటా..." అంది సుశీల.

"జ్వరానికీ, మనవాళ్లకూ పోటీ పెడితే జ్వరమే ఓడిపోతుందిలే వదినా!" షర్మిల మెల్లగా నవ్వేసింది.

"బిడ్డకోవైపు జ్వరం వస్తోంటే వాళ్లెలా పార్టీలో కూర్చున్నారో చూశావా వదినా? ఈరోజు వాళ్లని ఊరికే వదిలిపెట్టగూడదు. జాడించి వదిలిపెట్టాలి..."

"నేనూ అట్లే అనుకుంటానుగానీ ఆయనొచ్చి ముందు నిల్చుంటే అయ్యోపాపమనిపిస్తాది నాకు... ఆడిటర్లంటే పెద్ద పెద్దవాళ్తో పనిగదా? నెలకయిదారు పార్టీలైనా ఉంటాయి. ప్రతిసారీ ఎప్పుడో అర్ధరాత్రికి ఇంటికొస్తారు. మందు వాసన భరించలేనంత ఉంటాది. ఇట్లయితే వొళ్లేమయ్యేదని నేను ఏడ్చి ఆగడం చేస్తే ఈమధ్య బాగా తగ్గించేసినారు. కానీ ఈమధ్యేవరో ఆయన ఫ్రెండు శబరిమల పోయొచ్చినాడంట. వాళ్లు వస్తా వస్తా కారైక్కాల్ అని పాండిచ్చేరికి చెందిన ఊరి మీదుగా వచ్చినారంట. ఆ ఊర్లో మందు బాటిల్సు తక్కువ ధరకు అమ్మతారని తెలిసి తలా కొన్ని బాటల్సు కొనుక్కోని సీట్లకింద దాచి పెట్టుకోని వచ్చినారంట. ఈయనగ్గూడ రెండు బాటల్సు ఇచ్చినారు. అవి మా ఇంటికొచ్చినప్పటి నుంచే మా ఆయన మీ ఆయన ఎప్పుడొస్తారా, పార్టీ ఎప్పుడిద్దామా అని ఎదురుచూస్తానే ఉండారు..."

"వారు కూడా చాలా రోజులుగా ఇక్కడికి రావా లని అనుకుంటూనే ఉన్నారొదినా! చివరికీ సమ్మర్ హాలిడేస్‌లో కుదిరింది. అన్నట్టు వారు గూడా డిసెంబర్లో శబరిమలై వెళ్లొచ్చారు. కారైక్కాల్ సంగతి వారికి తెలిసి నట్టులేదు. తెలిసుంటే ఆయనా కొన్ని బాటిల్సు తీసు కొచ్చి జల్సా చేసి ఉండేవారు..."

"శబరిమల వెళ్లేటప్పుడు చాలా నిష్టగా ఉండా లంట గద వదినా?"

"అవును చాలా మహత్యమున్న దేవుడాయన. అంటూ పొంటూ తగలగూడదు. ఆడాళ్లు చేసిన వంట గూడా తినగూడదు. నలభైరోజులూ బ్రాహ్మణ హోటలు భోజనమే చేశారు."

"అక్కడికి ఆడవాళ్లు పోకూడదంట కదా?"

"అవునవును. ముట్లు వుడిగిపోయిన ముసి లాళ్లూ, ఎదగని ఆడపిల్లలూ వెళ్లొచ్చు..."

"అన్నమాదిరే మా ఆయనకు కూడా భలే భక్తి వదినా! ప్రతిదినమూ తెల్లారిజామున్నే నమాజుకు

పోతారు. నిజానికి దినానికైదు పూటలూ నమాజు చెయ్యా లని ఆయనకాశ. కానీ ఉద్యోగులకు సాధ్యం కాదు కదా?''

''నువ్వెప్పుడూ మసీదుకెళ్లవా?''

''ఆడోళ్లెక్కడైనా మసీదుకెళ్తారా? ఇంట్లోనే నమాజు చదువుకుంటాను. మా ఇండ్లలో మొగోళ్లకు రాకపోయినా ఫర్వాలేదుగానీ, ఆడోళ్లకు మాత్రం ఉర్దూ చదివేది రావాల్సిందే. నేను కూడా చిన్నప్పుడు ఉర్దూ నేర్చుకున్నాను...''

ఊరంతా బాగా మాటుమనిగిపోయినట్టుంది. దూరంగా రైల్వేస్టేషను నుంచి రైలు వేస్తున్న కూత స్పష్టంగా వినిపిస్తోంది. పాప నిద్రలోనే ఉలిక్కిపడు తోంది. షర్మిల ఒళ్లోని పాపాయి నిద్రలోనే పాలసీసాని పక్కకు తోసేస్తోంది. సుశీల గోడగడియారంకేసి చూసి, అది పని చేయడం మానివేసిందన్న విషయం గుర్తుకు తెచ్చుకొని, ''టయమెంతయి ఉంటుందో!'' అంది.

పాపాయిని ఉయ్యాలలో పడుకోబెట్టి వస్తూ షర్మిల చేతివాచీని వాకబుచేసి, ''పదకొండు కాబో తోంది...'' అంది.

కాస్సేపు మౌనంగా ఉండిపోయి, తర్వాత చివా లున తలపైకెత్తి, ''నాకు చాలారోజులుగా వో కోరి కుంటాంది. వారినెలాగైనా ఇంట్లో ఉండమని, నాకోసం వెయిట్ చెయ్యించాలి. అప్పుడు తెలుస్తుంది ఆయనకి నా బాధ...'' అంది సుశీల.

''నువ్వయితే కాలేజీకైనా పోవచ్చు. నేనెక్కడికి పోయేది?... పుట్టింటికైనా మా ఆయన సరిగ్గా పంపిం చరు....''

''మనం కూడా పార్టీ చేసుకుంటే సరి...'' సుశీల కంఠం కసిగా ఉంది.

''చేసుకుందామా? ఇంట్లో ఇంగో బాటిలుంది,'' తమాషా చేస్తున్నట్టుగా అడిగింది షర్మిల.

''ఏం బాటిల్?''

''పేరు వోడ్కా అంట... చాలా సాఫ్ట్‌డ్రింక్ అన్నా రాయన...''

''నువ్వు పుచ్చుకున్నావా ఎప్పుడైనా?''

''ఆ వాసన చూస్తేనే వాంతొచ్చేసినట్లవుతాది నాకు. అసలు మా పెండ్లయిన కొత్తలో- అదే, హనీ మూన్‌కని బెంగుళూరుకు పోయినప్పుడు కబ్బన్ పార్కు రెస్టారెంటుకు పోయినాం. తోటలోనే కుర్చీలు. జంటలు జంటలుగా కూర్చోని అందరూ తాగడమే. కార్లలో వచ్చిన జనాలు. ఆడోళ్లు కూడా మగోళ్ల మాదిరిగా బీరు తాగేసి, చక్కా సిగరెట్లు కాలస్తా వున్నారు. ఆయనేమో నాకూ ఒక గ్లాసులో పోసి తాగమని బలవంతం చేసినారు. మందు మాదిరి ఒక గుక్క మింగినానంతే! కళ్లల్లో నీళ్లు తిరిగి, ఒళ్లంతా అదోకమాదిరయిపోయింది. తిట్టిన తిట్టు తిట్టకుండా ఆ గ్లాసు కూడా ఆయనే తాగేసి నారు. అసలు హనీమూనంతా ఆయనకు తిట్టేదానికే సరిపోయింది...''

''అక్కడికి నువ్వే మేలు. మాకు హనీమూనూ లేదు, గినీమూనూ లేదు. పెళ్లయిన కొత్తలో మా ఇంట్లో రోజూ తగువులే!''

''... ... ... ... ...''

''ఏం జరిగింది?...''

''ఆ కథంతా ఇప్పుడు తవ్వకుంటే వొరిగేదే ముందిలే?''

''అన్నకు పెళ్లి ముందే...'' షర్మిల కుతూహలాన్ని ఆపుకోలేకపోయింది.

''నీకూ తెలుసునన్నమాట! ఆయన ఫ్రెండ్సు కందరికీ తెలిసిన భాగోతమేనట! నీకూ అన్నయ్య చెప్పే ఉంటారు. కానీ మా వాళ్లకే పెళ్లయ్యేదాకా ఆ సంగతి తెలియనే తెలియదు. జాగ్రత్తగా మమ్మల్ని గోతిలోకి దింపేశారు వాళ్లు...''

''ఆ అమ్మాయిప్పుడేడుంది?''

''ఏమో! ఈవైపునెక్కడా కాలేజీలో సీటు దొరక నట్టు మెడ్రాసుకెళ్లారు కదా వారు! ఎమ్మే చదువుతూ న్నప్పుడు పరిచయంట. ఆ పిల్ల తల్లిదండ్రులక్కూడా తెలుసునట. అసలు వాళ్లే ఎక్కడో గుడిలో దండలు మార్పించి పెళ్లయినట్టనిపించార్ట. వారు చదువుతూనే కొన్నాళ్లు ఇల్లు తీసుకుని సంసారం చేశార్ట. ఈ సంగతి తరవాతెప్పుడో మా అత్తమామలకి తెలిసి గగ్గోలు పెట్టారట. ఆ అమ్మాయికేదో డబ్బులు ముట్టజెప్పి వదిలించేసుకున్నారట. అయినా ఏం వదిలించుకో టంలే? ఇప్పటికీ నెలనెలా ఆయన జీతంలోంచి వెయ్యి రూపాయిలు బ్యాంకు నుంచీ అలాగే దానికెళ్లి పోతాయి...''

''నువ్వెప్పుడూ దాన్ని చూడలేదా?''

''చూస్తే చంపేసెయ్యనూ మరి...''

''అన్న అక్కడికెప్పుడయినా పోతారా?''

''వెళ్లారని తెలిస్తే ఊరుకుంటానా? పెళ్లయిన ఆరునెలలకు గానీ ఆ సంగతి తెలియలేదు. తెల్సిన మరుక్షణం మా ఇంటికెళ్లిపోయాన్నేను. అప్పుడీ కారుణ్య కడుపులో ఉంది. మా నాన్నగారయితే, ఇక

అత్తవారింటికి పంపనే పంపననేశారు. వారొచ్చి పంప మని అడగలేదు. నాన్నగారు నానా కష్టాలుపడి కాలేజీ లో ఉద్యోగం తెప్పించారు. ఉద్యోగం వచ్చిన రెండు నెలలకంతా మా మామగారు రాయబారం పంపిం చారు. వారు కూడా ప్రాధేయపడుతూ ఉత్తరాలు రాయ సాగారు. ఆ పిల్ల ముఖం చూడనని ప్రమాణాలు చేశారు. ఏం చేద్దాం... చివరకు వాళ్ల ఊరికే బదిలీ చెయ్యించుకున్నాను. దాదాపు రెండేళ్ల తర్వాత మళ్లీ కాపురం మొదలెట్టాం. అయితే నేను గట్టిగా పట్టుపట్టి వేరే కాపురం పెట్టించాను...''

''అయితే మీ అత్తా, మామా కూడా మీ ఊర్లోనే వేరుగా ఉండారా?''

''అవును.''

''అన్న ఒప్పుకున్నారా దానికి?''

''అసలు వేరే కాపురం పెట్టాలని పెళ్లయిన కొత్త లోనే వారనుకున్నారు. ఆ ఇంట్లో ఒకరిని చూస్తే ఇంకొ కరికి కాదు. అందరూ డబ్బు మనుషులు. వాళ్లు మాట్లాడుకొంటూంటే వ్యాపారస్థులు మాట్లాడుకొంటు న్నట్టే ఉంటుంది....''

''అదే మేలులే వదినా, లోపలొకటి బయటి కొకటిగా బతికే దానికంటే! మా మామ లేరులే. అత్త ఉండాది. బావలూ, మరుదులూ, ఆడబిడ్డలూ పెద్ద కుటుంబం. ఒకరిని చూస్తే ఇంకొకరికి ప్రేమ కారి పోతాది. ఎవరికివాళ్లు వాళ్ల సంసారానికని అన్నీ దాచి పెట్టుకుంటారు. ఈ ఊర్లో ప్రాక్టీసు పెట్టినారు కాబట్టి సరిపోయింది కానీ, లేకపోతే ఆయన వేరే కాపురం పెట్టే ఉండరు. వాళ్లేమో నన్నాపొయిలో పెట్టి ఈ పొయిలో తీస్తుంటారు. ఈయనకేమో వాళ్ల మాటే ఇష్టం. అంతెందుకు? మీ అన్న నన్ను చూడనైనా చూడకుండా పెళ్లి చేసుకున్నారు తెలుసునా?''

''నిజంగా?''

''అవును. వాళ్లమ్మ, అక్కచెల్లెళ్లు, వదినలు ఎవర్ని చేసుకొమ్మంటే వాళ్లనే చేసుకుంటానని చెప్పేసినారంట. వాళ్లందరూ వచ్చి చూసి ఫిక్స్ చేసుకున్నారు. అసలు పెండ్లికి ముందు ఫోటో అయినా పంపించమని చెప్ప మని మా ఫ్రెండ్సు గొడవ చేసినారు. ఫోటో లేదు, ఏమీ లేదు. పెళ్లయినాకే నేనాయన ముఖం చూసింది.''

''ముస్లింలలో అది సంప్రదాయమేనట కదా!''

''అది ఒకప్పటి సంగతి. ఇప్పుడందరూ పెండ్లి చూపులు చూస్తా ఉండారు. ఈయనొక్కడు నా ప్రాణాని కీమాదిరి దొరికినాడు. మా పెండ్లయినప్పుడు నాకు ఇరవై అయిదు, ఆయనకు ముప్పయ్యా వయస్సు. పెండ్లి కోసరం నాలుగైదేండ్లు ఎదురు చూసినాననుకో. ఎట్లాంటి మొగుడో తెలుసుకోవాలంటే ఆరు నెలలు ఎదురుచూడాల్సి వచ్చింది. పెళ్లయినాక ఈ మాదిరిగా రోజూ ఎదురుచూస్తానే ఉండాను. ఈ ఉద్యోగంలో నన్ను మించినోళ్లెవురూ ఉండరు,'' షర్మిల నవ్వుతోంటే విసుక్కుంటోందో, ఆనందిస్తోందో అర్థం కావడం లేదు.

''ఆ పనిలో నాది డిస్టింక్షను,'' అని సుశీల తన వాదన మొదలుపెట్టింది. ''కాలేజీలో వెయిట్ చేసీ చేసీ విసుగొచ్చి చచ్చిపోదామన్నంత కోపం వస్తోంది నాకు. ఒకోసారి బీపీ వచ్చేస్తుందేమోనన్నంత టెన్షను. మా ప్రిన్సిపాల్ రాక్షసి. పది నుంచీ నాలుగు దాకా కట్టు కదల నివ్వదు! ఈయనగారేమో ప్రొద్దున ఎంతకూ కదలరు. సాయంత్రాల్లో సమయానికి రారు. వాళ్ల ప్రిన్సిపాల్ ధర్మాత్ముడు. ఎగ్జామ్స్ డ్యూటీలప్పుడు నా గతి భగ వంతుడికే తెలుస్తుంది. పిల్లలొకవైపు ఏడుస్తుంటారు. అవతల ప్రిన్సిపాల్ రుసరుసలాడుతోంటుంది. వారికి నిమ్మకు నీరెత్తదు. ఇప్పుడు మేలేలే! పెళ్లయిన కొత్తలో నాకుద్యోగం లేదుగదా? ఈయన ఎంతకూ ఇంటి కొచ్చేవారుగాదు. వెయిట్ చేసి చేసి కళ్లు కాయలు కాసేవి. తర్వాతేమో మా పుట్టింట్లో రెండేళ్లున్నాను. నిజానికది ఇంకా పెద్ద వెయిటింగ్. మధ్యలో చాలా గొడవలు జరిగాయి. రాయబారాలూ, సంప్రదింపులూ జరిగాయి. కానీ వారు మాత్రం నా కంట పడలేదు. ఆ రెండేళ్లూ ఆయన కోసం ఎదురుచూసినట్టే లెక్క. వొకోసారి బీపీ వచ్చేసిందనే అనుకునేదాన్ని. నా ఎదురు చూడ్డం ముందు నీదేముందిలే?...''

మంచంపైన పడుకున్న కారుణ్య ఇటూ అటూ దొర్లి, పైకిలేచి కూర్చొని ఏడవసాగింది. ''సరిగ్గా పడుకోవే అంటే వినవుగదా? ఆకలిగా ఉందా చెప్పు?'' అంటూ విసుక్కొంది సుశీల.

షర్మిల పాలు కాచి కారుణ్య చేత తాగించింది. సుశీల లాలిత్య నెత్తుకుని మంచంపైన కారుణ్య ప్రక్కనే కూర్చుంది. కారుణ్య మళ్లీ నిద్రపోవడానికి ప్రయత్నించింది.

వంటింటిలోంచీ ఎలుకలు పాత్రలు దొర్లిస్తున్న చప్పుడు వినిపిస్తోంది. ఫాను సైతం విసుగ్గా బడబడ లాడుతోంది. స్కూటరొకటి ఇంటిముందు ఆగిన శబ్దం వినిపించింది. సుశీల దృష్టి మెట్ల వైపుకు మరల్చింది.

''ఇంటిగల్లాయన స్కూటరు,'' అంది షర్మిల.

''లాలిత్య వొళ్లు మళ్లీ మినమినమంటోంది. డాక్టరు దగ్గరికెళ్లి ఓ ఇంజెక్షను వెయ్యించి ఉంటే బావుండేది...'' సుశీల గొణుక్కొంది.

షర్మిల పైకి లేచి, ''ఒకసారి కిందింటికెళ్లి ఇంటి గల్లామెను చూసి వస్తాను. వాళ్లాయనకు మనవాళ్లేమైనా కనిపించినారేమో అడగతాను,'' అంటూ గబగబా వరండాలోకొచ్చి మెట్లుదిగి కిందికి వెళ్లిపోయింది.

సుశీల వంటింట్లోకెళ్లి రెండు గ్లాసుల నీళ్లతో కడుపు నింపుకుని మళ్లీ పిల్లల దగ్గరికొచ్చి వాళ్ల పక్కనే నడుం వాల్చింది. లాలిత్యకు టెంపరేచరుందేమోనని చూసి, కారుణ్య పైకి శాలువ లాగింది. కాస్సేపు ఆగి పోయిన గడియారం కేసి కోపంగా చూసింది. గడి యారం పక్కన రెక్కల పురుగుతో దాగుడుమూతలాడు తున్న బల్లిపైన దృష్టిని కేంద్రీకరించడానికి ప్రయత్నిం చింది.

అయిదు నిముషాలు గడిచినా షర్మిల పైకి రాలేదు.

మరో అయిదు నిముషాల తర్వాత ఇంటి ముందు స్కూటరు శబ్దం వినిపించింది.

సుశీల పైకిలేచి వరండాలోకొచ్చింది.

మెట్లెక్కుతూ, ''ఇంటిగల్లాయనను ఒకసారి అక్కడికెళ్లి చూసేసి రమ్మని అడుక్కున్నాను'' అంది షర్మిల.

''ఎక్కడికి?''

''అక్కడేదో యాక్సిడెంటు జరిగిందంట...'' షర్మిల గొంతు బొంగురుపోతోంది. కళ్లల్లోంచి నీళ్లు దుముకుతున్నాయి.

''యాక్సిడెంటా?.... ఎక్కడ...'' సుశీల నిలువునా వొణికిపోతూ గోడపైకి వొరిగిపోయింది. షర్మిల గాలిలో గడ్డిపోచలా ఊగిపోతోంది.

''గాంధీ రోడ్డు క్రాసులో... స్కూటర్ని లారీ గుద్దేసిందంట! ట్రాఫిక్ జామ్మయి, లేటుగా ఇంటికొచ్చి నానని ఇంటిగల్లాయన అన్నారు. నాకేమో భయంగా ఉంది. తెల్ల రంగు స్కూటరని ఎవరో అంటా ఉంటే ఇంటిగల్లాయన విన్నాడంట... సంగతి తెలిసి ఇంటి గల్లామె మొగుడ్ని చూసిరమ్మని తరిమింది...''

''ఊర్లో తెల్ల స్కూటర్లెంతమందికి లేవు...'' సుశీల మాటలు తనను తాను వోదార్చుకుంటున్నట్టుగా విని పిస్తున్నాయి.

''ఏమో! నాకు భయంగా ఉంది... ఆయన స్పీడుగా డ్రైవ్ చేస్తారు. రాత్రుల్లో ట్రాఫిక్ ఉండదని ఇంకా స్పీడు పెంచేస్తారు. పైగా పార్టీ...'' ఆమె గొంతు వణుకుతనే ఉంది.

''మనవాళ్లయి ఉండరులే వదినా! లోపలికిరా... వెంట మా ఆయనున్నారు కదా!... ఆయన జాగ్రత్తగా ఉంటారెప్పుడూ...'' సుశీల బలవంతంగా ఏడుపు నాపుకుంటోంది.

షర్మిల కుర్చీలో కూర్చుని కాళ్లు పైకెత్తి గుండెల కదుముకుంది.

సుశీల పిల్లల పక్కన కూర్చుని చీర కొంగుతో కళ్లు తుడుచుకోసాగింది.

గోడపైన బల్లి బిగ్గరగా అరుస్తోంది. సైలెన్సరు లేని వాహనమొహటి కారుబారు చేస్తూ పరుగెడు తోంది.

''కోపమొస్తే మా ఆయన స్పీడుగా డ్రైవ్ చేస్తారు...'' గ్రుక్కిళ్లు మింగుతూ అంది షర్మిల.

''ఇప్పుడేమీ కోపం లేదుగదా!'' సుశీల సముదా యించింది.

''ఈరోజు తెల్లారి ఆయనకు కోపమొచ్చింది వదినా! నిన్న ఆయనకొక జాబు వచ్చింది. అడ్రసు చూస్తే ఆడవాళ్ల అక్షరాల మాదిరిగా అనిపించింది. ఆ మాటంటే ఆయనకెక్కడలేని కోపం వచ్చింది. అప్పటి నుండి నాతో సరిగ్గా మాట్లాడనే లేదు...''

''ఉత్తరం పైని రాతని చూసి అనుమానిం చచ్చా...''

''జాబులు మాత్రమే గాదు. నేనెప్పుడైనా మా ఊరికి పోయినప్పుడు ఎవరెవరో ఆడోళ్లు ఇంటికొచ్చి పోతారని ఇంటిగల్లామె చెప్పింది. ఆయన్నడిగితే ఆఫీసులో పనిచేసే క్లర్కులని చెప్తారు...''

''ఉత్తరం చింపి చదువలేకపోయావా?...''

''చదవాలంటే నాకు భయం. తెరిచి చూస్తే అది ఆడపిల్ల రాసిందే అయితే ఏం చేసేది? తెలియకుండా ఉంటేనే మేలు... అసలా సంగతి ఆయన్నడగాలంటేనే భయం నాకు. ఈ పొద్దెందుకో బుద్ధిలేక అడిగేసినాను. ఆయనకు కోపం వచ్చేసింది. ఛీ... నాకు... అయ్యో... పాపం... ఆయన...''

''కోపం తెచ్చుకునేవాళ్లే మేలులే వదినా! మావారిలాగా మనసులో దాచుకునే వాళ్లతో ఎప్పటికైనా మోసమే!... మరి... ఇంతకూ... ఆ ఆక్సిడెంటు... నిజంగా... వీళ్లు...'' సుశీల ముక్కు చీదుకుంది.

''వారికి ఫ్రెండ్సుతో కలిస్తే ఇక వొళ్లు తెలియదు. గంటల తరబడీ తిరుగుతుంటారు... ఏమైనా అంటే

రెండు లక్షలకు ఎల్లయిసీ చేసిన్లేవే అని వేళాకోళం అప్పటికి నేనేదో...'' ఏడుపు ముంచుకు రావడంతో ఆమె మాట్లాడలేకపోయింది.

షర్మిల కన్నీళ్లు రాల్చుతున్న కనురెప్పల్ని బలవంతంగా మూసుకుని వణుకుతున్న పెదవులతో ప్రార్థన మొదలుపెట్టింది.

సుశీల పిల్లల ముంగురుల్ని సవరించుతూ వెక్కిళ్లు ఆపుకునే ప్రయత్నం చేయసాగింది.

కాస్సేపటి తర్వాత చేతులు ముద్దు పెట్టుకుని ప్రార్థన పూర్తిగావించి కళ్లు తెరిచింది షర్మిల.

ఆమెవైపుకు చూసే ధైర్యం చాలక దృష్టి మరల్చు కొంది సుశీల.

గది గుమ్మం దగ్గరి బూట్లూ, అలమారులోని పుస్తకాలూ, లోపలి గదిలో కొక్కానికి వేలాడుతున్న పాంటూ, వంట గదిలోంచీ కనిపిస్తోన్న హాట్‌బాక్సూ- అన్నీ తన వేదనని రెట్టింపు చేస్తున్నట్టుగా అనిపించ సాగింది షర్మిలకు. వీధిలో ఏ చప్పుడు వినిపించినా ఆమె ఉలిక్కిపడసాగింది. దూరం నుంచి వినిపిస్తున్న స్కూటర్ సవ్వడి దగ్గరికి వచ్చేస్తే ఎలాగన్న భీతి చెలరేగ సాగింది. తమ గోడ గడియారంతో ప్రపంచం కూడా పనిచేయడం మానేసి, ఎక్కడిదక్కడ ఆగిపోతే బావుండు ననిపించింది.

ఆమె గుండెల సవ్వడిని వేళాకోళం చేస్తున్నట్టుగా దూరం నుంచి రకరకాల శబ్దాల్ని మొదలెట్టిన స్కూట రొకటి ఏకాయెకిన తన శరీరం పైకొచ్చి నిల్చున్నట్టు ఆమె కనిపించేలా వాళ్లింటి ముందుకొచ్చి ఆగింది.

ఇద్దరూ ఒక్క ఉదుటున వరండాలోకొచ్చి నిల్చు న్నారు. ఒకరి గుండెల సవ్వడి ఇంకొకరికి వినిపి స్తున్నట్టుగా ఉంది ఇద్దరికీ.... ఇద్దరి శరీరాలూ చెమటతో తడిసిపోయాయి.

''అమ్మా షర్మిలా! ఆక్సిడెంటయిన స్కూటర్ అక్కడే పడి ఉందట. మనుషుల్ని మాత్రం హాస్పిటల్‌కు తీసుకెళ్లారట... మా ఆయనకు మన స్కూటర్ బాగా తెలుసు కదా! అది మన స్కూటర్ కాదటలే! నువ్వు భయపడాల్సిన పనిలేదు...'' అంటూ కింది నుంచే ఇంటిగల్లావిడ బిగ్గరగా అరిచి చెప్పింది.

సుశీల షర్మిల భుజంపైన చేయివేసింది. ఇద్దరూ వొకరి నొకరు ఆసరాగా చేసుకుని అలాగే నిల్చున్నారు. కాస్సేపు గడిచాక నెమ్మదిగా కదిలి ఇద్దరూ ఇంటిలో కొచ్చారు. ఇద్దరూ నేలపైన కూర్చుని గోడకు చేరగిల బడ్డారు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఎగసెగసి పడుతుండగా ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు. ఎందుకో అమాం తంగా ఇద్దరికీ సిగ్గు ముంచుకొచ్చింది.

సుశీల పెదవుల్ని సాగదీసి, ''మీ గుమాస్తా అసలు వెతకడం కోసం వెళ్లాడో లేదో! ఇంతకూ అతడి పెళ్లాం అతడికా వర్తమానం చేరవేసిందో లేదో...'' అంది.

''యేమో!... అయినా మనకంటే ఆ సుగుణమ్మే మేలు. మాటాడకుంటే పోయింది. మొగుడనే మనిషి కండ్లముందర పడుంటే చాలును,'' షర్మిల కంఠంలో విసుగు, బాధ, కోపం ఒక్కసారిగా ధ్వనించాయి.

కాస్సేపు ఆలోచించాక, ''అదీ ఒక రకమైన ఎదురుచూడ్డమే గదా! మొగుడితో సామరస్యం కోసం, సుఖమైన సంసార జీవితం కోసం, ఒకే కప్పు కింద ఉంటూ, ఏళ్ల తరబడి ఎదురుచూడ్డం... అంతే... తేడాల్లా అంతే!...''

వీధిలో గూర్ఖా బెత్తంతో నేలను మోదుతూ, నాలుగడుగులకోసారి విజిల్ వేస్తూ వెళ్తున్నాడు. ఆటో వొకటి గుడుగుడుమని చప్పుడు చేస్తూ ఎటో వెళ్తోంది.

బాగా దూరం నుంచీ, చీకటి బాజాపైన చిన్న చిన్న గులకరాళ్లు విసురుతున్నట్టుగా మెల్లగా శబ్దం....

''ఆయన స్కూటరు కూడా ఆ మాదిరి శబ్దం చేస్తుందప్పుడప్పుడూ...'' అంటూ వరండాలోకి నడిచింది షర్మిల.

''అది మనవాళ్ల స్కూటరు కాపోయినా ఫర్వా లేదులే వదినా! కావాలంటే పాపకు ఇంకోసారి ఆ మందే పోస్తాను. తెల్లవారిపోయినా ఫర్వాలేదు. వాళ్లు క్షేమంగా ఇల్లు చేరితే అంతే చాలు...'' అంది సుశీల.

షర్మిల పిట్టగోడ పైన్నుంచీ ముందుకు వంగి, 'ఎప్పుడో ఇట్ల ఒంగుతూ, కాలుజారి కిందపడి చస్తా నేమో నేను...' అని మరోసారి అనుకొంది.

సుశీల చూపులు వరండా మెట్ల వైపుకూ, షర్మిల చూపులు వీధి మలుపు దగ్గరికీ కదిలాయి.

*ఆంధ్రప్రభ వారపత్రిక, 3 నవంబర్ 1993*

